క్లుప్తంగా

తల్లిని కొట్టిన కేసులో తనయుడికి జైలు

సంతకవిటి: తల్లిని కొట్టి గాయపర్చిన కేసులో తనయుడికి జైలు శిక్ష విధించినట్టు ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు బుధవారం తెలిపారు. సంతకవిటి మండలం పొనుగుటివలస గ్రామానికి చెందిన శాసపు కృష్ణ తనను గాయపర్చాడని తల్లి అప్పలనారాయణమ్మ ఈ ఏడాది జనవరి 10న సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చగా జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ ముద్దాయికి ఐదు నెలల జైలు శిక్షతోపాటు రూ.100లు జరిమానా విధించారన్నారు. ఈ కేసును ఏపీపీ కిమిడి సూర్యకుమార్ వాదించారని తెలిపారు.

23 మద్యంసీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపుల్లో ఎస్‌ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, 23 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసామన్నారు.

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామంలో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 22 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం తెర్లాం -1 గ్రామ సచివాలయంలో వలంటీర్లతో సమావేశమైన ఆమె కార్యక్రమం నిర్వహణపై వలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను దరఖాస్తు చేసిన వెంటనే అధికారులు అందజేయనున్నారని, వీటి కోసం ఎటువంటి యూజర్ చార్జీలు చెల్లించనవసరం లేదన్నారు. జెడ్పీటీసీ ప్రతినిధి గర్బాపు రామారావు ప్రజలకు ఎంతో ఉపయోగమైన ఈ కార్యక్రమంను జయప్రదం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు.

నవధాన్యాల సాగుతో పంటలకు మేలు

రేగిడి: నవధాన్యాలు సాగుతో పంటలకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో సర్పంచ్ కె.గోవిందరావుకు చెందిన ఐదెకరాల పొలంలో 30 రకాల నవధాన్యాలను వేయించారు. నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేల సారవంతమవుతుందని, అలాగే చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే శక్తి పంటలకు వస్తుందన్నారు. ఖరీఫ్ దుక్కిలకు ముందు నవధాన్యాల పంటను పొలాల్లో కలియదున్నాలన్నారు. ఇలా చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజాం సిటీ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక సీతారామ థియేటర్ వద్ద ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఎస్.పిచ్చేశ్వరరావు బుధవారం పట్టుకుని, స్వాధీనం చేసుకున్నామన్నారు. రేగిడి ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పట్టుకుని, పోలీసులకు అప్పగించామన్నారు. ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

మెంటాడ: మండలంలోని పోరాం, మెంటాడ రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ లెంక సన్యాసప్పలనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, విత్తనాలు దగ్గర నుంచి పంట విక్రయం వరకు అన్నదాతలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు.

పొనుగుటివలస సచివాలయం మార్పునకు చర్యలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలసలో ప్రస్తుతం ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న సచివాలయాన్ని మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. బుధవారం గ్రామంలోని ప్రభుత్వ భవనాన్ని పరిశీలించి, అవసరమైన మార్పులు చేయనున్నామన్నారు. ప్రభుత్వ సచివాలయంలోనే సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఇటీవల గ్రామస్తులు వినతిపత్రం అందించారని, ఈ మేరకు జూలై 1వ తేదీ నాటికి చర్యలు పూర్తి చేసేందుకు చొరవ తీసుకుంటున్నామన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

వంగర: ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని తలగాం గ్రామ సచివాలయాన్ని బుధవారం సందర్శించిన ఆయన రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ప్రజలు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు.

ఆరోగ్య యోగం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారితో యోగా గురువులు పలు ఆసనాలు వేయించి, వాటి ప్రయోజనాలు వివరించారు. శరీరాన్ని, మనసును, ఆత్మను ఏకం చేసే ప్రక్రియ సాధనయే యోగా అని, నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే యోగా సాధనను అలవాటు చేసుకోవాలని కోరారు.

-సాక్షి నెట్‌వర్క్



రాజాం: వికాస తరంగణి కార్యాలయంలో యోగా సాధన



బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాల మైదానంలో యోగా సాధన చేస్తున్న మహిళలు



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లలతో యోగాసనాలు వేయిస్తున్న కార్యకర్త శ్రీదేవి



రాజాం సిటీ: యోగా డే ర్యాలీలో మున్సిపల్ అధికారులు



రేగిడి: ఖండ్యాం ప్రభుత్వోన్నత పాఠశాలలో యోగా డే



సంతకవిటి: యోగా సాధనలో మందరాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



రామభద్రపురం సచివాలయం-1లో యోగాసనాలు వేయిస్తున్నసర్పంచ్ ఈశ్వరరావు, ఈఓ సుప్రియ



మెంటాడ: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులతో ఎంపీడీఓ త్రివిక్రమ్



వంగర: ఎం.సీతారాంపురం పాఠశాలలో యోగా ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు



బాడంగి: యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అంబఖండి గ్రామ సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రేగిడి: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం మండలంలోని అంబఖండి, ఉంగరాడమెట్ట గ్రామాల్లో పర్యటించిన ఆమె సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌లను సందర్శించడంతో పాటు ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం) నిర్మాణం, పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు మందకొడిగా కొనసాగుతుండడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ల సేవలపై ఆరాతీశారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉంగరాడమెట్ట వద్ద జరుగుతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరరావు, మండల పరిషత్ ప్రత్యేకాధికారి పెంటోజీరావు, చీపురుపల్లి ఆర్‌డీఓ ఎం.అప్పారావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, పీఆర్ జేఈ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

వంగర: మండలంలోని మద్దివలస, ఎం.సీతారాంపురం, మగ్గూరు, మడ్డువలస ప్రాంతాల్లో పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్‌తో పాటు, లైసెన్స్, ఆర్‌సీ బుక్ వంటి ధ్రువపత్రాలు లేని వారికి అపరాద రుసుం విధించినట్లు ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



బాడంగి: రైతులకు విత్తనాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

బాడంగి: నారుమడుల్లో ధాన్యం విత్తనాలు చల్లే ముందు వాటిని శుద్ధి చేయాలని రేజేరు వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) సాయికుమార్ సూచించారు. మండలంలోని రేజేరు గ్రామ ఆర్‌బీకే(రైతు భరసా కేంద్రం) వద్ద రైతులకు బుధవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలు శుద్ధి చేసి, పొలాల్లో చల్లడం ద్వారా పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. ఈ నేపథ్యంలో వేరుకుళ్లు తెగులు సోకకుంటే మొలక శాతం పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విత్తనాలతో పాటు వాటిని శుద్ధి చేసేందుకు అవసరమైన సూడోమోనాస్ పౌడర్ ప్యాకెట్లను కూడా అందజేశారు. కౌలు రైతులు వీఆర్‌ఓల నుంచి సీసీఆర్‌సీ కార్డులు తీసుకువస్తే విత్తనాలు అందిస్తామని, అలాగే పీఎం కిసాన్ కోసం ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ బి.రమేష్, సర్పంచ్ వెంకటనాయుడు, ఏఎంసీ చైర్మన్ బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ చేతుల మీదుగా పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం, మెడల్ అందజేసి, సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్ అని, అందరూ బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.దుర్గారావు, హెచ్‌ఎం ఎం.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ స్వామినాయుడు

సంతకవిటి: మండలంలోని మోదుగులపేట గ్రామ పంటపొలాల గోర్జి ఆక్రమణపై గ్రామస్తులు తహసీల్దార్ సులోచనరాణికి ఫిర్యాదు చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి, గ్రామానికి చెందిన వాకముల్ల చిన్నారావు, వాకముల్ల సూర్యనారాయణ తదితరులు కలిసి గూనాపువాని చెరువు ఆయకట్టు పంట పొలాలకు వెళ్లే దారిలోని సర్వే నంబర్ 135లోని 17, సర్వే నంబర్ 137లోని 16 గోర్జిలను ఆక్రమిస్తున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్ రెడ్డి స్వామినాయుడు, రైతులు ఉన్నారు.

మత్తుతో జీవితం చిత్తు



వంగర: మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జనార్దనరావు



రేగిడి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

వంగర: మత్తు పదార్థాలు తీసుకుని, జీవితం చిత్తు(పాడు) చేసుకోవద్దని ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు సూచించారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో మాదక ద్రవ్యాల నియంత్రణ, దిశ యాప్ ఉపయోగాలు-వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. ఖైనీ, గుట్కా, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలై, జీవితం నాశనం చేసుకుంటున్నారని, వాటికి దూరంగా ఉండాలన్నారు. మద్యపానం కూడా చేయవద్దన్నారు. ఎక్కడైనా ఏ విధమైన ఆపదలో ఉన్నా దిశ యాప్‌ను సంప్రదించి, రక్షణ పొందవచ్చన్నారు.

రేగిడి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖైనీ, గుట్కా, గంజాయి, కొకైన్, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.

రాజాం సిటీ: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ పి.నీలావతి సూచించారు. బుధవారం స్థానిక ఎస్.ఎల్.టి.ఎన్ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కింది స్థాయి నుంచి పైతరగతులకు వచ్చిన విద్యార్థులు ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి, చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. ఆదర్శవంతమైన జీవనం సాగించి, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఆడపిల్లలు, మగపిల్లలు కూడా దిశ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చన్నారు.

మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు?

● బేబి నాయన, సుజయ్ నాయనలకు బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ సోరు సాంబయ్య ప్రశ్న



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ సాంబయ్య

బొబ్బిలి: మీరు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం మేలు చేశారని టీడీపీ నేతలు బేబి నాయన, సుజయ్ నాయనలను బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ సోరు సాంబయ్య ప్రశ్నించారు. బుధవారం స్థానిక పట్టణంలో ఆ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడిన ఆయన మిమ్మల్ని నమ్మి 15 ఏళ్లు అధికారం కట్టబెట్టిన నియోజకవర్గ ప్రజలకు మీరేమీ చేయలేదని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యేకు 15 రోజుల సమయమిచ్చి, రోడ్లు వేసేయమనడం సరి కాదన్నారు. మా వెంట్రుకలు కూడా ఎవరూ కదపలేరని బేబి నాయన మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మీరు మున్సిపల్ చైర్మన్‌గా ఐదేళ్లు, మీ అన్న ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినా నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అందుకే ఓ రైతు బిడ్డ(ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు)ను ఇక్కడి ప్రజలు గెలిపించుకున్నారన్నారు. బొబ్బిలి కోటకు హద్దుగా ఉన్న గోడ అవతల ఉన్న షాపులకు మీరు అద్దెలు ఎలా తీసుకుంటున్నారు.. అవి మున్సిపాలిటీ పరిధిలోనివి కాదా అన్నారు. షాపుల యజమానులు టీడీపీ జెండాలు కట్టకపోతే వారిని బెదిరించిన విషయం వాస్తవం కాదా అన్నారు. రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మీనాయుడు మాట్లాడుతూ 60 ఏళ్ల క్రితం నాటి రోడ్డును అధికారంలో ఉన్నప్పుడు మీరు విస్తరించకపోయినా ఇప్పటి ఎమ్మెల్యే రోడ్డు విస్తరణ పనులు చేయిస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తిపై లేనిపోని విమర్శలు చేయడం తగదన్నారు. పీసీసీ సభ్యుడు మువ్వల శ్రీనివాసరావు మాట్లాడుతూ 15 ఏళ్లపాటు అధికారంలో ఉన్న బొబ్బిలి రాజులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకపోగా అభివృద్ధి చేసిన వారిని విమర్శించడం, ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడడం తగదన్నారు.

ఉద్యాన పంటల పెంపకానికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఉద్యాన పంటల పెంపకానికి అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, పనులు జరిగిన వెంటనే వేతనదారులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉద్యాన పంటలు పెంపకానికి అవసరమైన పనులు గుర్తించాలని, నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన అన్ని రికార్డులను సిద్ధం చేయాలన్నారు. మండలంలో జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి ఏపీఓ కె.సుశీల పాల్గొన్నారు.

ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మండల స్థాయి క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఆర్‌బీఐ(రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు అందజేసి, సత్కరించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

-సాక్షి నెట్‌వర్క్



బాడంగి హైస్కూల్‌లో క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



తెర్లాం హైస్కూల్‌లో క్విజ్ పోటీల విజేతలతో ఎంఈఓ-2 పాపారావు, ఎస్‌బీఐ సిబ్బంది



రేగిడి: క్విజ్ పోటీల విజేతలతో నిర్వాహకులు



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఏపీజీవీబీ సిబ్బంది



బొబ్బిలి: విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మణరావు

పాలిథిన్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు



రిక్షాలో తరలిస్తున్న పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: పాలిథిన్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు హెచ్చరించారు. బుధవారం స్థానిక మెయిన్‌రోడ్డు మీదుగా శ్రీనివాస థియేటర్ రోడ్డులోని హోల్‌సేల్ దుకాణానికి తరలిస్తున్న నిషేధిత పాలిథిన్ కవర్లను అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులకు రూ.15 వేల అపరాద రుసుం విధించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ దుకాణాల్లో తనిఖీలు చేపడతామని, పాలిథిన్ కవర్లు పట్టుబడితే దుకాణం సీజ్ చేస్తామన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు

రాజాం: మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు వండిపెట్టాలని సచివాలయ కన్వీనర్ జి.అప్పలనాయుడు, ఎంపీటీసీ రాంబాబు సూచించారు. బుధవారం మండలంలోని కంచరాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను వారు పరిశీలించారు. వంటకాలు రుచి, శుచితో ఉండాలని, నిర్దేశిత రోజుల్లో రాగిజావ విద్యార్థులకు అందజేయాలని తెలిపారు.

సంక్షిప్తంగా...

జోరుగా 'ఉపాధి' పనులు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఏపీఓ కోట సుశీలతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సాంకేతిక సహాయకులంతా బుధవారం పనులు పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

రాజాం: మండలంలోని కొతారిపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ సాయిరాం బుధవారం పరిశీలించారు. వేసవి ఎండల నేపథ్యంలో రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనులు చేసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి

వంగర: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులు కోరుతున్నారు. ఇదే విషయమై మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మండల కేంద్రంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

కలాసీల కూలీ రేట్లు పెంచండి

రాజాం సిటీ: లోడింగ్, అన్‌లోడింగ్, బజారు కలాసీలకు కూలీ రేట్లు సంబంధిత యజమానులు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్ పార్కు వద్ద బజారు కలాసీలతో సమావేశమైన ఆయన యజమానులు కూలీ రేట్లు పెంచకుండా గత నాలుగేళ్లుగా శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పోలినాయుడు, రమణ, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.